● హరీశ్‌రావుతో వజ్రనాథ్



బీఆర్‌ఎస్ నేత మాగంటి వజ్రనాథ్, తన తల్లి మహానంద కుమారితో కలిసి ఆదివారం మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఇరువురు కాసేపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై చర్చించుకున్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేయాలని హరీశ్‌రావు వజ్రనాథ్‌కు సూచించారు.

- బంజారాహిల్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి)

22 నుంచి నవకర్ నవరాత్రి ఉత్సవ్

ఖైరతాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జల విహార్‌లో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 1 వరకు నవకర్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవ్ 2025 నిర్వహించనున్నట్టు నిర్వాహకులు కవిత, సలోనిజైన్‌లు తెలిపారు. ఈ మేరకు మనేపల్లి జ్యువెలర్స్, అన్వితల సహకారంతో నిర్వహించనున్న ఈ నవరాత్రి ఉత్సవ్ 2025 వేడుకల అధికారిక ఎంట్రీ పాస్ పోస్టర్‌ను ప్రముఖ బాలీవుడ్ గర్బా కొరియోగ్రాఫర్ జిగర్ సోనీ ఆదివారం జలవిహార్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిగర్‌సోనీ యువతులకు దాండియా నృత్యంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ ఉత్సవంలో ప్రతి రోజు మహాహారతి, లైవ్‌డోలు, వైవిధ్యమైన ఫుడ్‌కోర్ట్, సెలబ్రిటీ సందర్శనలతో పాటు ప్రత్యేక బహుమతులు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రగతి సమాజ అధ్యక్షుడు జిగ్నేష్‌దోషి, ప్రముఖులు అచ్యుత్‌రావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఇళ్ల నిర్మాణానికి కృషి: కార్పొరేటర్



గురుబ్రహ్మనగర్‌లో బస్తీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయారెడ్డి

బంజారాహిల్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గురుబ్రహ్మనగర్‌లో 30 సంవత్సరాలుగా ఉంటున్న గిరిజనులకు ఉన్న చోటే ఇళ్ల నిర్మాణం చేసుకునేలా ప్రభుత్వాన్ని ఒప్పించి అనుమతులు ఇచ్చేలా కృషి చేస్తానని టీపీసీసీ కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్ గురుబ్రహ్మనగర్‌లో ఆమె ఆదివారం పర్యటించారు. రోడ్డు నిర్మాణం కోసం గుడిసెలను తొలగించాలని రెవెన్యూ అధికారులు చెప్పారని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె కలెక్టర్‌తో మాట్లాడి రోడ్డు నిర్మాణం గురించి చర్చించనున్నట్టు చెప్పారు. అవసరమైతే ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు మోహన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా తిరిగేస్తున్నాయ్..!

- నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపైకి భారీ వాహనాలు
- పట్టించుకోని పోలీసులు
- ప్రమాదాల బారిన ద్విచక్ర వాహనదారులు, పాదచారులు



నిబంధనలు పాటించకుండా కోళ్లను తరలిస్తున్న లారీ



నిబంధనలు పాటించకుండా మధ్యాహ్నం సమయంలో రోడ్డుపై వెళ్తున్న లారీ

హైటెక్‌సిటీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్ల పైకి ఇష్టారీతిన వస్తున్న భారీ వాహనాలతో చిన్న వాహనదారులు, పాదచారులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. నిర్దేశిత సమయంలోనే రోడ్లపైకి రావాలని పోలీసులు ఆంక్షలు విధించినా.. భారీ వాహనదారులు ఆ నిబంధనలు పాటించడం లేదు. రద్దీ సమయాల్లో భారీ వాహనాలు రోడ్లపైకి రావడం వల్ల తరచూ ట్రాఫిక్ జామ్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా మాదాపూర్, అయ్యప్పసొసైటీ తదితర ప్రాంతాల్లో లారీలు నడిపే వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వీరి నిర్లక్ష్యం కారణంగా పలుసార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలూ ఉన్నాయి. అయినప్పటికీ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం పోలీసులకు కూడా తలనొప్పిగా మారింది. ఆరు నెలల కిందట ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఓ లారీ రోడ్డు మీదకు వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడం వల్ల ఐదో తరగతి చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన తర్వాత పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నా చిన్నపాటి వాహనాలు కూడా నిబంధనలు పాటించడం లేదు.

కోళ్ల వాహనం వచ్చిందంటే ఆగిపోవాల్సిందే..

కోళ్లను తరలించే వాహనానికి నాలుగు వైపులా డోర్లు వేసి రవాణా చేయాల్సి ఉంటుంది. కొందరు పట్టించుకోకపోవడం వల్ల తీవ్ర దుర్గంధంతో పాటు కోళ్ల వ్యర్థాలు గాలికి వెనక వచ్చే వాహనదారులపై పడుతున్నాయి. గత నెలలో మాదాపూర్ 100 ఫీట్ రోడ్డులో ఇలాగే ఓ వ్యక్తి కోళ్ల వాహనం వెనకాల వస్తుండగా, కళ్లలో వ్యర్థాలు పడడంతో కింద పడిపోయాడారు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి.

నిర్మాణ సామగ్రి తరలింపు వాహనాలతో..

మాదాపూర్ చంద్రనాయక్ తండాలో చిన్న, భారీ వాహనాల ద్వారా నిర్మాణ సామగ్రిని సరఫరా చేస్తుంటారు. రాత్రి, పగలు అని తేడా లేకుండా రోడ్లపై ఇసుక, క్వారీ డస్ట్, కంకర, సిమెంట్, మట్టి వంటి నిర్మాణ సామగ్రిని లారీలలో రవాణా చేస్తున్నారు. వేగంగా వెళ్లే సమయంలో లారీలో ఉన్న ఇసుక గాలికి ఆ వాహనం వెనక ప్రయాణించే ద్విచక్ర వాహనదారులతోపాటు పాదాచారుల కళ్లలో పడుతుంది. దీంతో సడన్ బ్రేక్ వేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా వాహన యజమానులు లారీలను మైనర్లతో డ్రైవింగ్ చేయిస్తున్నారు. మైనర్ డ్రైవింగ్‌తో గతేడాది డిసెంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే.

నిబంధనల ప్రకారం నడుచుకోవాలి

లారీలు, ఇతర భారీ వాహనాలు రాత్రి 11 నుంచి ఉదయం 7 గంటల లోపు మాత్రమే సిటీలోకి రావాలి. భారీ వాహనాల యజమానులు పూర్తి నిబంధనల ప్రకారం నడుచుకోవాలి. వాటర్ ట్యాంకర్లకు 24 గంటలు అనుమతి ఉన్నప్పటికీ భద్రతా ప్రమాణాలు పాటించని ఏ వాహనం కనిపించినా కఠినంగా వ్యవహరిస్తున్నాం. పెద్ద ఎత్తున అపరాధ రుసుములు వేస్తున్నాం. అయినా, తీరు మారకుంటే సీజ్ చేస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం.

- సత్యనారాయణ ట్రాఫిక్ సీఐ, మాదాపూర్

నీళ్ల ట్యాంకర్ వస్తే తడిసిపోవాల్సిందే..

అయ్యప్ప సొసైటీలో భారీ నిర్మాణాలు ఏర్పడ్డాయి. ఇక్కడ భూగర్భ జలాలు ప్రతీ సంవత్సరం డిసెంబరు నుంచే అడుగంటుతాయి. దీంతో అపార్ట్‌మెంట్‌లకు ప్రతీ నిత్యం నీటి ట్యాంకర్లు వస్తుంటాయి. వీటిపై మూతలు లేకపోవడం వల్ల నీరు లీకై రోడ్డుపై పడుతుంటాయి. స్పీడ్ బ్రేకర్ల వద్ద, గతుకుల రోడ్లలో ట్యాంకర్‌లోని నీరు ద్విచక్ర వాహనదారులపై పడడంతో తడిసిపోతున్నారు. దీంతో ట్యాంకర్ డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారుల మధ్య నిత్యం గొడవలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు స్పందించి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



విద్యార్థులకు ఆర్థిక సహకారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల చదువులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం అభినందనీయమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లో సంకేత్ సోషల్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 14 మంది పేద విద్యార్థులకు రూ.3.06లక్షల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో ప్రతిభావంతులైన పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువును మధ్యలో నిలపవద్దని అన్నారు. పిల్లల చదువుకు సంకేత్ ఆర్గనైజేషన్ ఆర్థిక సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. మున్ముందు మరిన్నీ సేవా కార్యాక్రమాలు చేయాలని సూచించారు. సంకేత్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలకు తన సహకారం అందించానని, భవిష్యత్తులోనూ అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు ఖలీల్‌బేగ్, సంకేత్ సంస్థ నిర్వాహకులు మురళీ, మమత, ధనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రావణ దహనానికి ఏర్పాట్లు: మనోహర్‌బాబు

పంజాగుట్ట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చింతలబస్తీలోని రాంలీలా మైదానంలో రావణ దహన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేస్తామని దసరా సమ్మేళన సమితి కమిటీ ప్రధాన కార్యదర్శి మనోహర్‌బాబు తెలిపారు. ఆదివారం చింతలబస్తీలో కమిటీ ముఖ్య కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. దసరా పండుగ రోజున రావణ దహనం చూడడానికి లక్షలాది మంది ప్రజలు రాంలీలా మైదానానికి వస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈకార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్, ఇతర నాయకులు హాజరవుతారని చెప్పారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు సూరి, ఉదయ్కర్, అంజయ్య, చింతలబస్తీ అధ్యక్షుడు చెన్నేశ్వర్, ప్రేమ్‌నగర్ బస్తీ ప్రధాన కార్యదర్శి భగవాన్‌దాస్ సుధీర్ కుమార్, దాసరి ప్రసాద్, సురేందర్, రవీందర్, దిలీప్‌సింగ్, కేఆర్ నర్సింగరావు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ ఇలాగేనా?

- మాజీ ఎమ్మెల్యే ప్రసూన
- జీహెచ్‌ఎంసీ సిబ్బందిపై ఆగ్రహం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రసూన

అమీర్‌పేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోయి ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన అన్నారు. పారిశుధ్య నిర్వహణ ఇలాగేనా అని జీహెచ్‌ఎంసీ సిబ్బంది తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అమీర్‌పేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం మాజీ ఎమ్మెల్యే పర్యటించారు. అనంతరం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు స్పందించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి ఉండడం, చెత్త కుప్పలు పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని అన్నారు. దోమల ఫాగింగ్‌కు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎల్లమ్మ పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు, భక్తులు ఇబ్బంది పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే అన్నారు. రాత్రివేళల్లో కొంత మంది యువకులు గంజాయి సేవిస్తూ అలజడి సృష్టిస్తున్నారని, దీనిపై పోలీస్ నిఘా నిరంతరం కొనసాగించాలన్నారు.

పటోలా ఆర్ట్స్ ప్రదర్శన ప్రారంభం



సినీ నిర్మాత పాయల్ సరాఫ్

బంజారాహిల్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌లోని రోడ్ నంబర్ 1లో గల లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో ఏర్పాటైన డీ సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శనను టాలీవుడ్ సినీ నిర్మాత, నగర సోషలైట్ పాయల్ సరాఫ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'విభిన్నమైన పటోలా ఆర్ట్ చీరలు, పటోలా హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్రోత్పత్తులను ఒకే వేదికలో ప్రదర్శించడం అభినందనీయమని అన్నారు. నేరుగా వీవర్ నుంచి వినియోగదారునికి అందించేందుకు ఏర్పాటైన ఈ ప్రదర్శనను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. డీ సన్స్ పటోలా ఆర్ట్స్ నిర్వాహకులు భవిన్ మాట్లాడుతూ, ఈ నెల 18వరకు కొనసాగనున్న ప్రదర్శనలో పట్టన్ పటోలా, బంధనీ, బనారసీ, జరీ కోటా, కాశ్మీరి, మహేశ్వరీ, కంచిపురం, మోడల్ అహింసా సిల్క్, లక్నోవీ, అజ్రక్ చీరలు, సూట్లు, కుర్తీలు, డ్రస్ మెటీరియల్, బెడ్ షీట్లు, ఆభరణాలు వంటి ఎన్నో విభిన్నమైన ప్రత్యేక కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మార్కెట్‌ను అందించడమే ఈ ఎగ్జిబిషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులు: రాములు



యాదవ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న వారితో రాములు యాదవ్, ఎంబీ కృష్ణ యాదవ్ తదితరులు

పంజాగుట్ట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి మార్గదర్శకం చేస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులు మాత్రమేనని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ అన్నారు. యాదవ్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యాదవ ఉపాధ్యాయ పురస్కార మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన 80 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. యాదవ సంస్కృతిని కాపాడుకుందామని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీల కతీతంగా యాదవులను గెలిపించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీజీఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణయాదవ్, సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లాడి శరత్‌యాదవ్, జవహర్‌నగర్ కార్పొరేటర్ మేకల లలితయాదవ్, సంఘం అధ్యక్షుడు డేగల శ్రీనివాస్ యాదవ్, సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, మనోజ్ యాదవ్, జయలక్ష్మి, రచయిత రాజేశం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బోరబండలో పోలీసు బందోబస్తు మధ్య జరుగుతున్న ర్యాలీ



శ్రీరాంనగర్ మసీదు వద్ద జరిగిన వేడుకలలో పాల్గొన్న అజాహరుద్దీన్, బొంతు రామ్మోహన్, సంజయ్‌గౌడ్



మిలాద్ ఉన్ నబీ ర్యాలీలో పాల్గొన్న ముస్లిం మత పెద్దలను సన్మానిస్తున్న బోరబండ కార్పొరేటర్ ఎండీ. బాబా ఫసియుద్దీన్

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

బోరబండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బోరబండ, రహ్మత్‌నగర్ డివిజన్లలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఆదివారం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. రెండు డివిజన్ల పరిధిలోని మసీదు కమిటీల ఆధ్వర్యంలో భారీర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వేల సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. బోరబండ సైట్-3 నుంచి ప్రారంభమైన ర్యాలీ సైట్-2 కాలనీ, బోరబండ బస్టాపు, మోతీనగర్ చౌరస్తా, శ్రీరాంనగర్ చౌరస్తా, కార్మిక నగర్, రహ్మత్‌నగర్, ఎస్పీఆర్ హిల్స్ మీదుగా కొనసాగింది. మిలాద్ ఉన్ నబీ ర్యాలీలో పాల్గొన్న మత పెద్దలను బోరబండ, రహ్మత్‌నగర్ కార్పొరేటర్లు బాబా ఫసియుద్దీన్, సీఎన్‌రెడ్డిలు శాలువాలతో సత్కరించారు. బోరబండ ప్రధాన రహదారిపై, శ్రీరాంనగర్ మసీదు వద్ద మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అజహరుద్దీన్, మాజీ కార్పొరేటర్ సంజయ్‌గౌడ్, కాంగ్రెస్ మహిళా నాయకురాలు హబీబా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామ్ నగర్‌లో ముస్లిం మత పెద్దలను సన్మానించిన రహ్మత్ నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి



ఎర్రగడ్డ ఏజీ కాలనీలో మిలాద్ ఉన్ నబీ ర్యాలీని ప్రారంభిస్తున్న అడిషనల్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి

బేగంపేట: బేగంపేటలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రసూల్‌పుర చౌరస్తా వద్ద నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ పాల్గొన్నారు.

ఎర్రగడ్డ: మిలాద్ ఉన్ నబీ వేడుకలు మతసామరస్యానికి ప్రతీక అని అడిషనల్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎర్రగడ్డలోని ఏజీ కాలనీలో మిలాద్ ఉన్ నబీ ర్యాలీని ఆయన ప్రారంభించారు. నేతాజీనగర్, ఏజీ కాలనీ, సుల్తాన్‌నగర్, బి శంకర్‌లాల్, వెంకటేశ్వర కాలనీ, నందనగర్, ఎర్రగడ్డ మీదుగా ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో పీస్ కమిటీ వెస్ట్ జోన్ సభ్యులు మహమ్మద్ సలీం జావేద్, ఏక్ మినార్ మజీద్ కమిటీ సభ్యులు, ముస్లిం మత గురువులు పాల్గొన్నారు.



రసూల్‌పుర చౌరస్తాలో అన్నదానం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ

పేద ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ

యూసు‌ఫ్‌గూడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీ పండును పురస్కరించుకుని ఆదివారం వెంకటగిరిలో నిరుపేద ముస్లింలకు దివంగత మాజీ ఎమ్మెల్యే గోపినాథ్ సతీమణి మాగంటి సునీత నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ, భిన్నత్వంలో ఏకత్వాన్ని నమ్మిన సిద్ధాంతి మాజీ ఎమ్మెల్యే గోపినాథ్ అని అన్నారు. కార్యక్రమంలో మాగంటి అక్షర, మాగంటి దిశిర, ముస్లిం మైనారిటీ పెద్దలు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ముస్లింలకు నిత్యావసరాలు అందజేస్తున్న మాగంటి సునీత



సన్మానం

బీజేపీ మైనార్టీ మోర్చా తెలంగాణ అధ్యక్షుడిగా ఎన్నికైన జగ్‌మోహన్ సింగ్‌ను సికింద్రాబాద్ గురుద్వార సాహెబ్‌లో ప్రబంధక్ కమిటీ సభ్యులు ఆదివారం సన్మానించారు. ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ కొంతం దీపిక, గురుద్వార సాహెబ్ ప్రబంధక్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- రెజిమెంటల్‌బజార్, ఆంధ్రజ్యోతి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన మధురానగర్‌కాలనీ వాసులు

కాలనీలో సమస్యలను పరిష్కరించాలి

బౌద్ధనగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు ఆదివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిశారు. కాలనీ అధ్యక్షుడు బ్రహ్మచారి ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు కేంద్రమంత్రిని సత్కరించి అనంతరం జ్ఞాపికను అందజేశారు. అనంతరం కాలనీలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి తెలిపారని కాలనీవాసులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజుసాగర్, కాలనీ సభ్యులు ఈశ్వరయ్య, రామిరెడ్డి, సంజీవరెడ్డి, శ్రీధర్, ఎల్లయ్యగౌడ్, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



జ్యుడీషియల్ అకాడమీలో జరిగిన సమావేశంలో పాల్గొన్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు

బాలికల భద్రత, రక్షణపై అవగాహన

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్

అడ్డగుట్ట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజంలో బాలికల భద్రతతో పాటు రక్షణ విషయంలో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ అభిప్రాయపడ్డారు. ఆదివారం సికింద్రాబాద్ జ్యుడీషియల్ అకాడమీలో నిర్వహించిన బాలల న్యాయకమిటీ మహిళా సంక్షేమశాఖ సంయుక్తంగా నిర్వహించిన సెమినార్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో పెరుగుతున్న నేరాల్లో మైనర్ల పాత్ర ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న సమాఖ్య ప్రతినిధులు

నిత్యావసర వస్తువుల అందజేత

చిలకలగూడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైల్వే బ్రాహ్మణ సేవాసమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం ఇద్దరు పేద బ్రాహ్మణులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. దాతలు మాల్యాల శ్రీనివాసరావు, శ్యామలా విష్ణు, సుదీంద్రల సహకారంతో కార్యక్రమం చేపట్టినట్లు, బ్రాహ్మణ సంక్షేమానికి తమవంతుగా పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక మద్దతు తెలుపుతూ సహాయ సహకారాలు అందజేస్తున్నట్లు ప్రతినిధి ఎం.కామేశ్వరరావు తెలిపారు.

'యూరియా అందించేలా చర్యలు తీసుకోవాలి'

బౌద్ధనగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): యూరియా కృత్రిమ కొరతతో తెలంగాణ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం వంచిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం వారాసిగూడలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సీఎం నేతృత్వంలో ప్రభుత్వం రైతులకు సమయానికి యూరియాను అందించటంలో విఫలమవుతుందన్నారు. ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించడం విషయంలో బీజేపీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తుందన్నారు. ఇప్పటికైనా రైతులకు సరిపడా యూరియాను అందించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.




పోలింగ్ బూత్‌ల పరిశీలన

సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల కమిషన్ ప్రతిపాదనపై ఆదివారం తుకారాంగేట్‌లోని పోలింగ్ బూత్‌లను పరిశీస్తున్న నర్సింగ్‌రావు(బీఎ‌స్పీ), ప్రకాశ్‌గౌడ్ (బీజేపీ), రాజసుందర్ (బీఆర్ఎస్), జలేందర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ (బీఆర్ఎస్)లు ఉన్నారు.

- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి

ధూల్‌పేటలో గంజాయి ముఠా అరెస్ట్

8.2 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న ఎక్సైజ్ సిబ్బంది

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధూల్‌పేట్‌లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. వారి నుంచి గంజాయి ప్రెస్సింగ్ మిషన్‌తో పాటు 8.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ధూల్‌పేట దిలావర్ గంజ్ ప్రాంతానికి చెందిన రాజ్ ఆలియాస్ కబూతర్‌వాలా రాజాసింగ్, తుల్జారాం సింగ్‌లు ఎవరికీ అనుమానం రాకుండా గంజాయి దందా చేస్తున్నారు. ఒడిషాకు చెందిన ఆనంద్ కుమార్, ప్రకారీ దీపక్ నుంచి గంజాయి తెప్పించి నగరంలో విక్రయిస్తున్నారు. వీరికి ధూల్‌పేట్‌కు చెందిన దుర్గేష్ సింగ్, రోహిత్ సింగ్ సహకరిస్తున్నారు. వీరి దందాపై పక్కా సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ టీం దిలావర్‌గంజ్‌లోని ఓ ఇంటిపై దాడి చేసింది. ఎక్సైజ్ సిబ్బంది కబూతర్‌వాలా రాజాసింగ్, తుల్జా సింగ్‌ను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4లక్షల విలువైన 8.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరా, విక్రయం చేస్తున్న ఆనంద్ కుమార్, దీపక్, దుర్గేష్ సింగ్, రోహిత్ సింగ్‌లు పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ టీమ్‌లీడర్ అంజిరెడ్డి తెలిపారు.



వేడుకల్లో పాల్గొన్న జంపన ప్రతాప్, గజ్జెల నగేష్



న్యూబోయినపల్లి: వేడుకల్లో పాల్గొన్న బేగంపేట్ ఏసీపీ గోపాల కృష్ణమూర్తి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి



మిలాద్ ఉన్ నబీ ర్యాలీ వేడుకల్లో శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్న ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

బౌద్ధనగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లో మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆయా ప్రాంతాల్లో ఉన్న మసీదుల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారాసిగూడ కౌసర్ మసీదు నుంచి భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ వారాసిగూడ చౌరస్తా, మహ్మద్‌గూడ, షాబాద్‌గూడ, నేతాజీనగర్ చౌరస్తా, పద్మారావునగర్, చిలకలగూడ చౌరస్తా, చిలకలగూడ, మైలార్‌గడ్డ, సీతాఫల్‌మండి, నామాలగుండు, శ్రీదేవీ నర్సింగ్‌హోమ్‌ల మీదుగా మరలా వారాసిగూడ కౌసర్ మసీదుకు చేరుకుంది. ఈ ర్యాలీలో ముస్లిం సోదరులు, యువకులు భారీగా పాల్గొన్నారు. సీతాఫల్‌మండి వద్ద స్థానిక కార్పొరేటర్ సామల హేమ ముస్లిం సోదరులకు స్వాగతం పలికారు. పలు కూడళ్లలో వారు విన్యాసాలు చేశారు. చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, మధుసూదన్‌రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ గౌడ్ ఎస్సైలు సుధాకర్, రాకేశ్, మల్లికార్జున్, రామచంద్ర రెడ్డి బందోబస్తును నిర్వహించారు. చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్సై శ్రీధర్‌లు ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకుని వారాసిగూడ చౌరస్తాలో న్యూ ఎంజీఎం బేకరీ అధినేత హాజీపాషా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు వెయ్యిమందికి చికెన్ బిర్యానీని పంపిణీ చేశారు.

బోయినపల్లిలో..

బోయినపల్లి ఖాదర్ ఝుండా ఇంతెజామియా కమిటీ ఆధ్వర్యంలో పెన్షన్ లేన్‌లో ఘనంగా వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు బేగంపేట్ ఏసీపీ గోపాల కృష్ణమూర్తి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, జక్కుల మహేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గజ్జల నగేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లీం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం బోర్డు కమిటీ సభ్యులు అతావుల్లా షరీఫ్, షకీబ్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

- బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం మిలాద్ - ఉన్ - నబీ వేడుకలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక ముస్లింలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో డీఐ సర్దార్ నాయక్, ఎస్ఐలు శివశంకర్, గణేష్ గౌడ్, నందిత, అవినాష్, సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు.



మిలాద్ - ఉన్ - నబీ ర్యాలీలో భేటి బచావో బేటికో పడావో బ్యానర్లతో చిన్నారులు



ర్యాలీని పరిశీలిస్తున్న బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు



వారాసిగూడలో బిర్యానీ పంపిణీ చేస్తున్న న్యూ ఎంజీఎం బేకరీ అధినేత హాజీ పాషా



వారాసిగూడ చౌరస్తాలో విన్యాసాలు చేస్తున్న యువకులు

ఉచిత వైద్యమందించేందుకు కృషి: ఎమ్మెల్యే

బౌద్ధనగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఉచిత వైద్యమందించేందుకు తనవంతు కృషి చేస్తున్నానని సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. ఆదివారం వారాసిగూడ ఆర్ట్స్ కాలేజీ టర్నింగ్ పాయింట్ వద్ద ఎస్ఆర్‌వీ మల్టీ స్పెషాలిటీ మేనేజింగ్ డైరెక్టర్ సుంకు రామచందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన వైద్య పరీక్షలను చేయించుకున్నారు. నగరంలో పలు ప్రాంతాల్లో ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు శిబిరంలో పాల్గొని పలు రకాల వైద్య పరీక్షలను నిర్వహించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఎమ్మెల్యే ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్యసేవలను అందించేందుకు ముందుకు వస్తున్న వ్యక్తులు, సంస్థలను ప్రోత్సాహిస్తున్నామని తెలిపారు. మురికివాడలు, కాలనీలు, బస్తీల్లో వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఎస్ఆర్‌వీ మల్టీ స్పెషాలిటీ క్లినిక్‌తో పాటు విబ్బున్ ఫార్మా, సుంకు ట్రస్ట్ వంటి వివిధ సంస్థల ద్వారా, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సుంకు రామచందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ, నాయకులు సంజీవ్‌ముదిరాజ్, రబ్బానీ, శైలేందర్, మల్లేష్ పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరంలో బీపీ చెక్ చేసుకుంటున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, క్లినిక్ మేనేజింగ్ డైరెక్టర్ సుంకు రామచందర్ తదితరులు

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు ప్రయోజనం : తలసాని

పద్మారావునగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ప్రయోజకరమని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం బన్సీలాల్‌పేట డివిజన్‌లోని మేకలమండిలో గల ప్రభుత్వ పాఠశాలలో బద్రి విశాల్ పన్నాలాల్ పిట్టి, అగర్వాల్ సేవాదళ్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంపుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వైద్య ఖర్చులు పేదలకు భారంగా మారాయని, ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, నిర్వాహకులు శరత్ పిట్టి, దీపక్ గుప్త, ప్రదీప్ అగర్వాల్, సుధీర్ గుప్తా, నిఖిల్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, లక్ష్మీపతి, ఏసూరి మహేష్, మహేందర్‌గౌడ్, కుమార్ యాదవ్, అబ్బాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

విద్యార్థులు చదరంగంలో రాణించాలి : రామచందర్‌రావు



తెలంగాణ ఓపెన్ చిల్డ్రన్ చెస్ 2025 టోర్నమెంట్‌లో చదరంగం ఆడుతున్న క్రీడాకారులు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావును శాలువాతో సన్మానిస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులు శ్రీరామ్ తదితరులు

తార్నాక, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల మేధో సంపత్తిని పెంపొందించే ఉత్తమమైన క్రీడా చదరంగమని అటువంటి చదరంగంలో పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు రాణించేవిధంగా పాఠశాల యాజమాన్యాలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. ఆదివారం చదరంగం క్రీడాకారుడు శ్రీరామ్ ఆధ్వర్యంలో లాలాపేట్‌లోని కార్తీకా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ ఓపెన్ చిల్డ్రన్ చెస్ 2025 టోర్నమెంట్‌ను ఎన్. రామచందర్ రావు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ డైరెక్టర్ నిషా ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రామచందర్ రావు మాట్లాడుతూ చదరంగం క్రీడలో హంపి, హరికృష్ణ, హారిక లాంటి చాలామంది తెలుగు క్రీడాకారులు రాణిస్తున్నారని, విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకుని చదరంగంలో రాణించాలని సూచించారు. అనంతరం టోర్నమెంట్ నిర్వాహకులు శ్రీరామ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రతోపాటు, ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 350 మంది క్రీడాకారులు టోర్నమెంట్‌లో పాల్గొనడం జరిగిందన్నారు. టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఒక లక్ష రూపాయల నగదుతో పాటు, ట్రోఫీ, ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తామని తెలిపారు.

మీకోసం నేనున్నానని చెప్పే నాయకుడు మోదీ

- హిందూ ధర్మమే గొప్పది
- ఉచిత పథకాలకు స్వస్తి చెప్పాలి
- బ్రహ్మశ్రీ గరికపాటి నర్సింహారావు

మల్కాజిగిరి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో మీకోసం నేనున్నానని చెప్పే గొప్ప నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ మాత్రమే.. దేశంలో హిందూ ధర్మం మాత్రమే గొప్పదని, ఎవరైనా హిందూ ధర్మాన్ని, ధర్మసిద్ధాంతాన్ని ఆచరించాల్సిందేనని ప్రముఖ ప్రవచకులు బ్రహ్మశ్రీ గరికపాటి నర్సింహారావు అన్నారు. మల్కాజిగిరి లక్ష్మీ సాయి గార్డెన్స్‌లో ఆదివారం రాత్రి స్వధర్మే నిధనం శ్రేయః దేశమే దేహం-ధర్మమే ప్రాణం పేరిట భక్తులకు ప్రవచనాలు వినిపించారు. ఈ సందర్భంగా ఆయన తన ప్రవచనాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం ఇస్తున్న ఉచితాలకు అలవాటు పడకుండా స్వశక్తితో ప్రతి ఒక్కరు ఎదగాలని అన్నారు. దేశాన్ని పట్టిపీడిస్తున్న అవినీతి ఓ జాడ్యమని దాన్ని కట్టడిచేయడానికి దేశ ప్రధాని మోదీ కృషి చేస్తున్నారన్నారు. రాజకీయ నాయకుల్లో మార్పుతోనే దేశంలో మార్పు సాధ్యమవుతుందని చెప్పారు. ప్రపంచంలోనే హిందూ మతాన్ని మించిన మతం మరొకటి లేనేలేదని తెలిపారు. మనం స్వదేశీ వస్తువులనే కొనాలని, పాడిపంట అన్నీ మనవేనని మనం లేనిదే డోనాల్డ్ ట్రంప్ ఎక్కడ అని అన్నారు. మన దేశ సాంప్రదాయాలను మన పిల్లలకు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు.

కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు, ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్లు ఉరపల్లి శ్రవణ్, క్యానం రాజ్యలక్ష్మి, గున్నాల సునీతయాదవ్, మీనా ఉపేందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు రాంబాబు, అడ్వొకేట్ శ్రీనివాస్, ప్రభు గుప్తా, వాసంశెట్టి శ్రీనివాస్, రాచర్ల శ్రీనివాస్, పలువురు బీజేపీ నాయకులు భక్తులు పాల్గొన్నారు.

పీవైఎల్ సంఘం ధర్నా వాయిదా

- నేడు గాంధీ సూపరింటెండెంట్‌తో చర్చలు

అడ్డగుట్ట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గాంధీ ఆస్పత్రిలో రోగులకు సరైన వైద్యం అందడంలేదని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) ఆధ్వర్యంలో సోమవారం గాంధీ ఆస్పత్రి ముందు ధర్నా నిర్వహించాల్సి ఉండగా ధర్నా వాయిదా వేస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి తమకు ఫోన్ ద్వారా సోమవారం ఆస్పత్రి సమస్యలపై చర్చ చేద్దామని చెప్పడంతో ధర్నా వాయిదా వేశామన్నారు. సంఘం ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించారన్నారు. సోమవారం సూపరింటెండెంట్‌తో చర్చలో తాము నాలుగు రోజుల క్రితం ఆస్పత్రిలో నెలకొన్న రోగుల సమస్యలపై ఆమె దృష్టికి తీసుకొస్తామని ఆయన చెప్పారు.

'స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయం'

బేగంపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల చదువులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం అభినందనీయమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లో సంకేత్ సోషల్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 14 మంది పేద విద్యార్థులకు రూ.3.06లక్షల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో ప్రతిభావంతులైన పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువును మధ్యలో నిలపవద్దని అన్నారు. పిల్లల చదువుకు సంకేత్ ఆర్గనైజేషన్ ఆర్థిక సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. మున్ముందు మరిన్నీ సేవా కార్యాక్రమాలు చేయాలని సూచించారు. సంకేత్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలకు తన సహకారం అందించానని, భవిష్యత్తులోనూ అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు ఖలీల్‌బేగ్, సంకేత్ సంస్థ నిర్వాహకులు మురళీ, మమత, ధనశ్రీ తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్‌లో 3కే నమో యువ రన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, బీజేవైఎం నియోజకవర్గం కన్వీనర్ గడ్డం నవీన్

21న 3కే నమో యువ రన్‌ను విజయవంతం చేయాలి

ముషీరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ఈనెల 21న సాయంత్రం 7గంటలకు నెక్లస్ రోడ్‌లో నిర్వహించే 3కే నమో యువ రన్‌ను విజయవంతం చేసేందుకు యువత పెద్దఎత్తున పాల్గొనాలని బీజేపీ మహాకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ముషీరాబాద్ వాలీబాల్ హాల్‌లో బీజేవైఎం నియోజకవర్గం కన్వీనర్ గడ్డం నవీన్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు బీజేపీ చేస్తున్న కృషిలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుషాల్ గౌడ్, ఇన్‌చార్జి చిత్తరంజన్ గుప్తా, నాయకులు అనిల్ కుమార్, ఆయూష్, సాయి, చింటూ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శాంతి

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్

ముషీరాబాద్, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శాంతి పేర్కొన్నారు. ఆదివారం భోలక్‌పూర్‌లోని ప్రభుత్వ బాలికల వసతిగృహంలో విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శాంతి మాట్లాడుతూ... విద్యార్థుల చదువు, ఆరోగ్య సంరక్షణతోపాటు సౌకర్యాల కల్పనలో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమయాన్ని వృథాచేయకుండా విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సుఖన్య విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.